క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్

కొత్తూరు: నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సీతంపేట ఐటీడీఏ పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. మండలంలోని కొత్తగూడలో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. భవన నిర్మాణ పనులకు సంబంధించిన అంచనాలను పరిశీలించారు. సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. అంచనాల్లో తెలిపేవిధంగా పనులు చేయించాలన్నారు. పనుల్లో ఎటువంటి తేడాలున్నా సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఈ రమాదేవి, డీఈఈ శిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ రమణ

పాతపట్నం: గిరిజన యువతకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన అవసరమని బ్రెడ్స్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జేవీ రమణ అన్నారు. మండలంలో ప్రహరాజాపాలేంలోని బ్రెడ్స్ కార్యాలయంలో గిరిజన యువతకు అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు ధర్మారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ వెంకటేష్

సరుబుజ్జిలి: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండకపోతే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఎస్ఎస్‌టీ కౌన్సిలర్ సీహెచ్ వెంకటేష్ తెలిపారు. మండలంలోని పెద్దసవలాపురం గ్రామంలో శుక్రవారం యూనియన్ బ్యాంకు సౌజన్యం, ఎస్ఎస్‌టీ అధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతా అవగాహనా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అటల్ పింఛన్ యోజన, పీఎం జేజేవై, పీఎంఎస్‌బీవై ఇన్సూరెన్స్ పథకాలు ప్రతీ ఒక్కరూ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ హరనాథ్, సీసీడీ కనక మహాలక్ష్మి, సీసీ రమాదేవి, సిబ్బంది చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

పొందూరు: సామాజిక మాధ్యమాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.సత్యనారాయణ సూచించారు. స్థానిక సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న కుట్టు శిక్షణ కేంద్రంలో శుక్రవారం నారీశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధానికి 1098, పోలీస్ ఎమర్జెన్సీకి 112 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మంచి అలవాట్లతోనే మానసిక అరోగ్యం

కొత్తూరు: మంచి అలవాట్లతో మానసిక ఆరోగ్యం లభిస్తుందని మండలంలోని నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాఘవదాసు అన్నారు. మండలంలోని నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మానసిక ఆరోగ్య వారోత్సవాల ముగింపు కార్యక్రమం సమగ్ర శిక్ష జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ అంపిలి ప్రశాంత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఆరోగ్యంగా ఉండాలంటే చేపట్టాల్సిన కార్యక్రమాలు వివరించారు. అంతకుముందు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఇన్‌చార్జి హెచ్ఎం పైల రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌సీసీ ఆఫీసర్ పి.మోహన్‌రావు విద్యార్థులతో మానసిక ఆరోగ్య పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతను గుర్తించి సానుకూల ఆలోచనలతో జీవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు గొంటి గిరిధర్ పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కొత్తూరు: మండలంలోని బలద గ్రామానికి చెందిన అరుబోలు కమలకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదనే కారణంతో విధులకు ఆటంకపరుస్తూ.. కులం పేరుతో దూషించారని తహసీల్దార్ బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమలతో పాటు బంధువులైన మరో ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్ శుక్రవారం తెలియజేశారు. అలాగే తనపై తహసీల్దార్ అసభ్యకరంగా ప్రవర్తించారని కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్‌పై కౌంటర్ కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.



మొక్కజొన్న.. లాభాలు మిన్న

- సాగుకు రైతులు మొగ్గు
- 110 రోజుల్లో పంట చేతికి
- ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి

సరుబుజ్జిలి: వాణిజ్య పంటల వలన లాభాలు ఆర్జిస్తున్న రైతులు రెండు సీజన్లలో కూడా మొక్కజొన్న పంటపై ఆసక్తి చూపుతున్నారు. రానున్న సీజన్‌లో ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, పొందూరు మండలాల్లో 1,584 ఎకరాల్లో సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఆరుతడి పంటతోపాటు తక్కువ పెట్టుబడి కావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. వరిపంటల కోతలు ముగిసిన తర్వాత మొక్కజొన్న పంట వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

సాగుచేసే విధానం

ఖరీఫ్ అనంతరం రైతులు ఎక్కువగా మొక్కజొన్న సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. దీని పంటకాలం 110 రోజులు. రబీ సీజన్‌లో అంట్వాడా అనే రకం విత్తనం ఎక్కువగా వేస్తారు. విత్తనాల మధ్య వ్యత్యాసం 20 మీటర్ల పొడవు, 60 సెంటీమీటర్ల వెడల్పు ఉండాలి. ఎకరా సాగులో వచ్చే దిగుబడి సుమారు 20 నుంచి 30 క్వింటాళ్ల వరకు ఉంటుంది. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం క్వింటా ధర సుమారు రూ.2,300ల వరకు ఉంటుంది. అలాగే మొక్కజొన్న సాగుకు వరిపంట కంటే ఖర్చు తక్కువ అవుతుంది. ఎకరాకు విత్తనాలు, సాగు చేసేందుకు, సస్యరక్షణ, దుక్కి, విత్తనాలు వెదజల్లేందుకు, నూర్పిడికి కలిసి మొత్తం సుమారు రూ.12,800ల వరకు ఖర్చు అవుతుంది.

తెగుళ్లు తక్కువ

వరి, ఇతర పంటల కంటే మొక్కజొన్న పంటకు తెగుళ్ల బెడద అంతగా ఉండదు. విత్తునాటిన తొలి రోజుల్లో ఆరుతడి నీరు కట్టాలి. తదుపరి పైరు ఎదిగిన తర్వాత సరిపోయినంత మేర సాగునీటిని నిల్వ చేయాలి. ఈవిధంగా చేస్తే పంటకు ఎటువంటి చీడపీడలు సోకకుండా మంచి దిగుబడులు సాధ్యపడతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

మండలం	సరుబుజ్జిలి	బూర్జ	ఆమదాలవలస	పొందూరు
మొక్కజొన్న సాగు (ఎకరాల్లో..)	246	367	437	534

తక్కువ ఖర్చుతో లాభాలు



మొక్కజొన్న సాగు చేయడం వలన వరి కంటే అధిక లాభాలు వస్తాయి. ప్రతిఏటా మొక్కజొన్న సాగు చేయడం వలన ఆశించిన ఫలితాలు వస్తున్నాయి. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు సాగు చేస్తున్నాము.

– ఎస్.కోటేశ్వరరావు, రైతు, అలమాజీపేట

గిట్టుబాటు ధర వస్తుంది



మొక్కజొన్న పంట పండించిన రైతులకు అధిక లాభాలు వస్తున్నాయి. అతి తక్కువ ఖర్చుతో లాభాలు సాధించవచ్చు. దీనివలన అధికంగా రైతులు రెండు సీజన్లలో సాగుచేసి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందుతున్నారు. రైతుసేవా కేంద్రాలు ద్వారా రైతులకు కావాల్సిన సమస్త సాగు సమాచారం అందిస్తున్నాము.

– బి.మన్మథరావు, వ్యవసాయాధికారి, సరుబుజ్జిలి

రీ సర్వేతో సమస్యలు పరిష్కారం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: భూముల రీ సర్వేతో సుమారు వందేళ్ల నుంచి వస్తున్న సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని పారాపురం గ్రామంలో భూముల రీసర్వే మూడో విడత గ్రామసభ సర్పంచ్ కుంచాల రత్నాలు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. భూ యజమానులకు ఎంతో ఉపయోగపడే భూముల రీ సర్వేను సద్వినియోగించుకోవాలని సూచించారు. సర్వే బృందాలకు భూ యజమానులు సహకరించాలని కోరారు. రైతుల సమక్షంలో రీ సర్వే చేయడం జరుగుతుందని చెప్పారు. సర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించి అధారాలు చూపించాలన్నారు. సర్వే సమయంలో తప్పులు గమనిస్తే అధారాలతో తహసీల్దార్, మండల సర్వేయర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు. సమావేశంలో రీ సర్వే విధివిధానాలను తహసీల్దార్ కె.బాలకృష్ణ వివరించారు. అంతకుముందు భూముల రీ సర్వేపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ సవర సావిత్రి, డీఐవో జనార్ధనావు, విలేజ్ సర్వేయర్ అల్లు తిరుపతిరావు, వీఆర్వో రామారావు, ఆర్ఐ గిరీష పట్నాయిక్, సనపల కోటేశ్వరరావు, పెదకోట సాదుబాబు, వైకుంఠరావు, ఎంపీటీసీ సభ్యుడు వనము లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నందకుమార్, మాజీ ఎంపీటీసీ కుంచాల నూకరాజు, కిరణ్ కుమార్, సవర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

జలుమూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అనునిత్యం అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. మండలంలోని సువరం, తిమడాం క్లస్టర్ పరిధి తిమడాం, కొమనాపల్లి, బొడ్డపాడు గ్రామాల్లో 'కార్యకర్తలతో కృష్ణ చైతన్య' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని ధ్వజమెత్తారు. అధికారులు, పోలీసులు కూటమి నాయకులకు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. అందరి పేర్లు గుర్తుపెట్టుకొని మరీ తగిన సమాధానం చెబుదామన్నారు. పార్టీ మరింత బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, పార్టీ ఉపాధ్యక్షుడు బగ్గు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎం.శ్యామలరావు, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా బూత్ లెవెల్ అధ్యక్షుడు దామ మన్మథరావు, నియోజకవర్గం గ్రీవెన్స్ అధ్యక్షుడు ధర్మాన జగన్, నాయకుడు పైడి విఠలరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వెలమల అసిరినాయుడు, వాన రాజు, అంపోలు తిరుపతిరావు, మెండ కృష్ణ, కరణం గణపతిరావు, వెలమల దొరబాబు, వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఈఆర్‌వో జయదేవి

నరసన్నపేట: స్థానిక సంస్థలకు ఎన్నికలు దగ్గర పడుతున్నాయని ఓటర్ల జాబితా సక్రమంగా రూపొందించాలని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ అభిప్రాయాలు తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ తరఫున మురళీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఒక కుటుంబంలోని ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నారని, కావున స్థానిక సంస్థల ఎన్నికల వద్దకు వచ్చేసరికి ఇటువంటి పొరపాట్లు లేకుండా సరిచేయాలని కోరారు. ఒక కుటుంబానికి చెందిన ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉన్నట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. తగు చర్యలు తీసుకుంటామని ఈఆర్‌వో జయదేవి హామీనిచ్చారు. అలాగే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002లో ఉన్న ఓటర్లు జాబితా ప్రకారం ఇప్పుడు ఉన్న ఓటర్లకు మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో నరసన్నపేట తహసీల్దార్ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కనపల శేఖరరావు, ఎంపీటీసీ నేతింటి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఓవీపేట విద్యార్థి



రోహిత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

బూర్జ: మండలంలోని ఓవీపేట ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి దిబ్బ రోహిత్ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) శ్రీకాకుళంలో నిర్వహించిన అథ్లెటిక్స్ విభాగంలో హైజంప్ 100 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్ర క్రీడలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కారుకు నిప్పంటించిన దుండగులు



కాలిపోయిన కారు

జలుమూరు: అందవరం పంచాయతీ రామకృష్ణాపురంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తన కారుకు నిప్పంటించారని అర్చకుడు మర్ల ప్రశాంత్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో శివాలయం నిర్మాణం విషయంలో కొందరు తనను బెదిరించారని పేర్కొన్నారు. శ్రీకాకుళం క్లూస్‌టీమ్, నరసన్నపేట సీఐ శ్రీనివాసరావులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రశాంత్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జలుమూరు పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం

పాతపట్నం: క్యాన్సర్ స్కీనింగ్ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని తామర గ్రామంలో రాగోలు గ్రేట్ ఈస్ట్రన్ మెడికల్ స్కూల్ అండ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్కీనింగ్ వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూలకుచేరిన యంత్రాలు



ధర్మలక్ష్మీపురం సచివాలయంలో నిరుపయోగంగా ఉన్న ఇన్సినేటర్

- గత ప్రభుత్వంలో ఇన్సినేటర్లు అందజేత
- నిరుపయోగంగా మారిన వైనం



వాండ్రాయి సచివాలయంలో నిరుపయోగంగా ఉన్న వైనం

సారవకోట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారిశుద్ధ్య పరిరక్షణకు ఎంతో కృషి చేసింది. దీనిలో భాగంగా ఆడపిల్లలు ఋతుక్రమం సమయంలో వినియోగించే నాప్‌కిన్స్ కాల్చేందుకు వీలుగా ఇన్సినేటర్ యంత్రాలు ప్రతీ పంచాయతీకి అందజేశారు. రూ.లక్షలు వెచ్చించి ఈ యంత్రాలను అందించగా నరసన్నపేట నియోజకవర్గంలో ఏ ఒక్కచోటా వీటిని వినియోగించే దాఖలాలు కన్పించడం లేదు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేసి చెత్త సేకరణ సమయంలో వచ్చిన నాప్‌కిన్స్‌ను విద్యుత్ సాయంతో నడిచే ఈ యంత్రాల ద్వారా కాల్చేందుకు అందజేశారు. అయితే చాలా చోట్ల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలు పూర్తికాకపోవడం, కొన్నిచోట్ల పూర్తయినా నిర్వహణకు విద్యుత్ సదుపాయం లేకపోవడంతో ఈ యంత్రాలు నేటికీ వినియోగంలో లేవు. దీంతో ఈ యంత్రాలు మూలనపడి ఉన్నాయి. నరసన్నపేట నియోజకవర్గంలోని 91 సచివాలయాల పరిధిలో 140 పంచాయతీ ఉండగా.. ఈ 140 పంచాయతీలకు ఒక్కొక్క యంత్రం చొప్పున అందజేశారు. అయితే ఏ ఒక్కచోట కూడా ఈ యంత్రాలు వినియోగంలో లేనట్లు తెలుస్తుంది. దీంతో ఇప్పటికైనా వీటిని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వినియోగంపై దృష్టి సారిస్తాం

గతంలో ప్రతీ పంచాయతీకి ఈ ఇన్సినేటర్లు అందజేయడం జరిగింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఆయా కేంద్రాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో వినియోగంలోకి తీసుకు రాలేదు. వాటిపై దృష్టి సారించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– పి.సింహాచలం, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ, సారవకోట మండలం

మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి



కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కృష్ణదాస్ తదితరులు

నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మంజూరైన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని తప్పుబట్టారు. దీనివలన పేద విద్యార్థులు డాక్టర్లు అయ్యే అవకాశం కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని, దీంట్లో భాగంగా విడతల వారీగా అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టనుందని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, అభిమానులకు పిలుపునిచ్చారు. అనంతరం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, బగ్గు రామకృష్ణ, కేసీహెచ్‌బీ గుప్త, కణిత కృష్ణారావు, కనుసు సీతారాం, ధర్మాన జగన్, సురంగి నర్సింగరావు, లుకలాపు రవి, సతివాడ రామినాయుడు, బొబ్బాది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

సరుబుజ్జిలి: మండలంలోని నందికొండ కాలనీలో అపారిశుద్ధ్యంపై 'ఇలా ఉంటే రోగాలు రావా' అనే శీర్షికతో సాక్షి పత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా గ్రామంలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. అంటువ్యాధులు సోకకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

ఆస్పత్రిలో గర్భిణీ బంధువుల ఆందోళన



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న గర్భిణీ బంధువులు

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో స్త్రీ వైద్య నిపుణురాలు కృషి గర్భిణీకి సకాలంలో వైద్యం చేయకపోవడంపై బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. మేజరు పంచాయతీ తమ్మయ్యపేటకు చెందిన దేవాది ప్రియాంక నిండు గర్భిణీ. తనకు ఉమ్మ నీరు లీక్ అవుతోందని తల్లి తోటాడ మాధవితో కలిసి ఆస్పత్రికి వెళ్లింది. అయితే అప్పటికి డాక్టర్ లేరు. సిబ్బంది ఉన్నా సరైన తనిఖీలు చేయలేదు. ఆ తర్వాత స్త్రీ వైద్య నిపుణురాలు కృషి వచ్చినా తనిఖీలు చేయడంలో జాప్యం చేశారు. ఇప్పటివరకు ఎక్కడో ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకొని ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి కంగారుపడితే ఎలా అని గర్భిణీ, ఆమె బంధువులపై కేకలు వేశారు. దీంతో ప్రియాంక బంధువులు అంతా కలిసి డాక్టర్‌ను నిలదీశారు. దీంతో ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి ఘర్షణ మరింత పెరగకుండా నివారించారు. అనంతరం వైద్యురాలు కృషి వైద్య పరీక్షల చేశారు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు వద్ద ప్రస్తావించగా ఆస్పత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని అన్నారు. ఈ ఘటనపై వివరాలు తెలుసుకొని మరోసారి పొరపాటు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

నిబంధనలు పాటించాలి



బాణసంచా గోడౌన్ పరిశీలిస్తున్న పోలీసులు

పొందూరు: దీపావళికి బాణసంచా విక్రయించేవారు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ స్పష్టం చేశారు. మండలంలోని పిల్లలవలస, బురిడికంచరాం గ్రామాల సమీపంలో ఉన్న బాణసంచా లైసెన్స్ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. అనుమతులు లేని మందుగుండు దుకాణాలు ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విక్రయ సమయంలో ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను పరిశీలించారు. అలాగే బాణాసంచా దుకాణాల లైసెన్స్ పత్రాలు, సామాగ్రి నిల్వల రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు ఎస్ఐ వి.సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

తెగుళ్ల కాలం.. పంటలు భద్రం..!

- జాగ్రత్తలు తీసుకుంటే దిగుబడులు
- వ్యవసాయాధికారి కిరణ్ వాణి సూచనలు





వరి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పాతపట్నం: ఇటీవల జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీని ప్రభావంతో చాలాచోట్ల వరిపొలాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ప్రస్తుతంలో జిల్లాలో 1.28 లక్షల హెక్టార్లలో వరి సాగులో ఉంది. అయితే వర్షాల వలన పంటలకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని మండల వ్యవసాయాధికారి పి.కిరణ్ వాణి హెచ్చరిస్తున్నారు. అందువలన నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పంట ముంపునకు గురైతే

వర్షాల కారణంగా వరి పంట నీట మునిగితే ముందుగా పొలంలో ఉన్న నీరు మొత్తం బయటకు పోయేలా తగిన ఏర్పాట్లు చేయాలి. నీరు తగ్గుముఖం పట్టాక ఎకరానికి 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకుంటే తెగుళ్ల రాకుండా ముందస్తుగా నివారించవచ్చు. నీట మునిగిన వరిపంట కుళ్లిపోకుండా ఎరువులు ఉపయోగపడతాయి.

అగ్గి తెగులు

వరిలో అగ్గి తెగులు సోకినప్పుడు ముదురు ఆకులపై నూలు కండె ఆకారంలో గోధుమరంగు మచ్చలు వచ్చి ఆకులు ఎర్రబడతాయి. దీని నివారణకు ట్రై సైక్లోజోల్ 120 గ్రాములు ఎకరా పొలానికి పిచికారీ చేయాలి.

తుప్పు తెగులు

నేలలో జింక్ లోపం ఉన్నప్పుడు తుప్పు తెగులు ఆశిస్తుంది. వరి నాటిన 2 నుంచి 6 వారాల్లో ముదురాకు చివర్లలో ఈనెకు ఇరుపక్కలా తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు చిన్నవిగా పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. మొక్కలు గిడసబారి దుబ్బు చేయవు. పైరుకు జింక్ లోపం కనిపించగానే లీటరు నీటికి జింక్ సల్ఫేట్ కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు లేక మూడు సార్లు పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ తెగులు

గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని గోకి తినివేయడం వల్ల ఆకులు తెల్లబడతాయి. పంట పిలక దశలో ఉంటే తాడుతో చేనుకు అడ్డంగా 2–3 సార్లు లాగితే పురుగులు కింద పడిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ మందు చొప్పున ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేయాలి.

పాము పొడ తెగులు

వరిలో దుబ్బు చేసే దశ నుంచి ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేపీ పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు ప్రొపికొనజోల్ ఎకరానికి 200 మిల్లీ లీటర్లు లేదా ఎక్సోకోనోజల్ 400 మిల్లీ లీటర్లు ఎకరానికి జల్లుకోవాలి.